**యేసు - దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచ కూడదని చెప్పెను. మార్కు 10:9.**



# వివాహము.. ..విడాకులు

(రెండవ భాగము)


రచయిత

బ్రదర్: జి. దావీదు రాజు

## 1. విశ్వాస ఘాతకుడు భార్యను పరిత్యజిస్తాడు.

*మీ భార్యల విషయములో విశ్వాసఘాతకులుగా ఉండకుడి. భార్యను పరిత్యజించుట నాకు అసహ్యమైన క్రియయని ఇశ్రాయేలీయుల దేవుడుగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. మలాకీ. 2: 15,16.*

పైవాక్యంలో భార్యలను పరిత్యజించువారు విశ్వాసఘాతకులని, వారు దేవునికి అనహ్యులని చదువుచున్నాము. ప్రకటన. 21:27వ.లో అసహ్యమైనదానిని జరిగించువారు దేవుని రాజ్యములో ప్రవేశింపరని, వారు నరకంలో పడవేయబడుదురని చదువుచున్నాం. కనుక పరలోకం వెళ్లగోరువారు భార్యను పరిత్యజింపకూడదు. ''నేను విశ్వానఘాతకుడనుకాను, నేను స్వచ్ఛమైన విశ్వాసిని'' అని ధైర్యంగా చెప్పగోరువారు తన భార్యతో మరణం వరకు నమాధానంగా కాపురం చేయాలి. చాలామంది భార్యను పరిత్యజించటానికి భర్త అహంకారమే కారణమవుతుంది. ఈ గుణానికి చెందినవారు భార్యను పనికత్తెనుగాను, కూలీ మనిషిగాను చూస్తారు. భార్యను ఏమాత్రం గౌరవించరు. వీరు చెప్పింది చేయటమే భార్యపని. భార్య ఏ విషయంలోను ఏమాత్రం ప్రశ్నించకూడదు. ఎదురుచెప్పకూడదు. కొందరు స్త్రీలు భర్తకు మాత్రమేగాక ఇంట్లో వారందరికి గొడ్డు చాకిరి చేయాలి. అత్తమామలను గౌరవించుచు భర్త యొక్క అక్కచెల్లెండ్రను అన్నదమ్ములను గౌరవించుచూ వారికి కూడా సేవచేయాలి. భర్తకు సంబంధించినవారు ఏమి తిట్టినను ఈమె నోరు తెరువకూడదు. తన భార్య మీద తన వాళ్లల్లో ఏ ఒక్కరు ఫిర్యాదు చేసినా ఇతడు మృగంలా మారి ఆమెను కొడతాడు. ముందూ వెనుకా ఏమీ ఆలోచించకుండా మాటలతోను, చేతలతోను భార్యపై

విరుచుకుపడతాడు. ఎక్కువశాతం ఈ పరిస్థితి ఉమ్మడి కుటుంబాలలో జరుగుతుంది. అందరూ కలిసి ఉండాలని కోరుకుంటారు. నిజమే! ప్రభువు కోరేది, బోధించింది ఇదే. కాని ప్రేమలేని చోట అది కుదరదు. అయితే "ప్రేమ" అంటే అర్థమేమిటో అహంకారులకు తెలియదు. తమ్మునుతాము ప్రేమించుకునేవారికి తెలియదు. భార్యను ఎలా ప్రేమించాలో పెళ్లి చేసుకున్నవాడికి తెలియాలి. అలానే అప్పటి వరకు మరొక ఇంట్లో ఉండి తన ఇంట్లోకి కోడలిగా వచ్చినామెను ఎలా ప్రేమించాలో అత్తకు తెలియాలి. ఎందుకంటే, ఆమె పెళ్లి చేసుకొని తల్లితండ్రులను, అక్క చెల్లెళ్లను, తమ్ముళ్లను వదిలి కొడుకుకు భార్యగాను తనకు కోడలిగాను వచ్చింది. కాబట్టి ప్రధానంగా భర్త ఆమెను ప్రేమించాలి. ఆదరించాలి. "ప్రేమ" అనేదానికి మరొక పేరు తల్లి, లేక తండ్రి' అని అర్థం. జ్ఞానము గలవాడు తాను పెండ్లి చేసుకున్న భార్యను కూతురుగానో, తాను బాగా ప్రేమించిన చెల్లిగానో" చూచుకోవాలి. పరిశుద్ధ గ్రంథంలో "పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి" అని చదువుచున్నాం. (ఎఫెసి. 5:25). అంతేగాని, మీ తల్లితండ్రులను, మీ అక్క చెల్లెండ్రను ప్రేమించుడి" అనిలేదు. పెండ్లి కాకముందు వరకు తల్లిదండ్రులను ప్రేమించాలి. పెళ్లయిన తరువాత భార్యను ప్రేమించాలి. భార్యభర్తల ప్రత్యేకానుబంధమును గూర్చియే "వారిద్దరును ఏకశరీరమగుదురు". ఎఫెసి. 5:31) అని వ్రాయబడింది. అంతేగాని "తల్లితండ్రులతోనో, అక్క చెల్లెండ్రతోనో ఏకశరీరముగా ఉందురని వ్రాయబడలేదు". పెండ్లి తరువాత ప్రేమించాల్సింది ప్రధానంగా భార్యనే. భర్త తన భార్యను తన శరీరంలో సగభాగమని గ్రహించాలి. అంటే వారిద్దరు

# వివాహము..విడాకులు (చివరి మాట)

(రెండవ భాగము)

సత్యమును ప్రేమించు సత్యాన్వేషులకు ప్రేమ పూర్వక స్తోత్రములు. దీనికి ముందు "వివాహం - విడాకులు" అను మొదటి భాగముగా వెలువడిన పుస్తకమును మీరు చదివియున్నారనియు, అందులో వ్రాయబడిన సంగతులను మీరు గ్రహించియున్నారనియు మేము నమ్ముచున్నాము. మరలా ప్రభువు ప్రేమనుబట్టి ఈ రెండవ భాగము కూడా వ్రాయబడి మీ ముందున్నది. ప్రభువు కృపనుబట్టి ఇప్పటి వరకు ఈ పుస్తకముతో పదమూడు పుస్తకములు రచించుట జరిగినది. ఎంతోమంది వాటిని చదివి మేము చాలా ఆశీర్వాదములు పొందుకున్నామని ఉత్తరముల ద్వారాను, ఫోను ద్వారాను తెలియచేయుచున్నారు. అందుకు మేము దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ప్రధానంగా పరిశుద్ధాత్ముడు ఈ రెండవ భాగములో రచయిత, బ్రదర్. దావీదురాజుగారి ద్వారా మరిన్ని సంగతులను ఈ పుస్తకములో పొందుపరిచారు. ఇవి "వివాహం" విషయంలో దేవుని సంకల్పములు, దేవుని ఆలోచనలు. ఈ సంగతుల పక్షముగా నిలబడి జీవించువారు ధన్యులు. "వివాహం" విషయములో పరిశుద్ధాత్ముడు ఇచ్చిన ఈ సమాచార పక్షముగా వాధించువారు ధన్యులు. సత్య సంబంధులైతే తమలో అనేకములైన లోపములున్నను, దేవుడు తమ్మును ప్రేమించి హెచ్చరించుచున్న ఈ సంగతులనుబట్టి దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదురు. వివాహం విషయములో పరిశుద్ధాత్మ దేవుడు తమకు తెలియజేయించిన సమాధాన సంగతుల విషయమై దేవునికి నమస్కరించుదురు. ఈ సమాచార వెలుగులో తమ మార్గములను సరిచేసుకొని తిన్నని మార్గములో నడచుకొందురు. "వివాహం ఘనమైనది". వివాహం ఘనహీనమైనదిగా మారరాదు. అది వివాదాలతో విడాకులకు పరుగెత్తి ఘనహీనంగా మారకూడదు. వివాహం అల్లర్లుతో, అహంకారంతో నీచంగా ఉండదని బుద్ధిమంతులు గ్రహిస్తారు. సత్యదేవుడున్న వారి వివాహ జీవితం విడాకులుగా మార్పు చెందదని దేవుడు ఈ పుస్తకంలో తెలియజేస్తున్నాడు. సత్యప్రేమికులు ఈ సత్య సమాచారానికి సంతోషిస్తారు. "విడాకులు తీసుకో, విడాకుల కొరకు ప్రఖ్యాతిగాంచిన లాయర్లను పెట్టుకో" అని పోరాడే దురాత్మను తమ మనస్సులోనుండి పారద్రోలతారు. అలా పారద్రోలి భార్యాభర్తలిద్దరూ "ఏక శరీరముగా" మారి ప్రియుడైన యేసుక్రీస్తుని హత్తుకుందురు. అవునుగదా! మన ప్రభువు అటువంటి వారి కొరకే రాబోవుచున్నారు! అవును, అటువంటి వారి కొరకు మాత్రమే ప్రభువు రాబోవుచున్నాడని పరిశుద్ధాత్మ తెలియజేయుచున్నాడు.

- ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు; విను వాడును రమ్ము అని చెప్పవలెను. ప్రక. 22:17. ఆమెన్.

బ్రదర్. కె. జాన్‌పాల్.
సెల్: 9949775895.